సాక్షి
రంగారెడ్డి
శనివారం । 23 । మార్చి । 2024



పొంచి ఉన్న పదవీ గండం!

ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరికి పదవీ గండం ముంచుకొస్తోంది. 8లో▸



ప్రజలకు నష్టం కలిగించొద్దు

రోడ్డు విస్తరణ పనుల్లో ప్రజల ఆస్తులకు నష్టం కలిగించకుండా చూడాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. 8లో▸



న్యూస్‌రీల్

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

షాద్‌నగర్: షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో కలిసి ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సెమినార్‌ను విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: దేశంకోసం ప్రాణాలు త్యాగం చేసిన షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అమరత్వం పొందిన రోజును పురస్కరించుకొని శనివారం షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో నిర్వహించే సెమినార్‌ను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్, ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా 'అమరుల త్యాగాలు–స్వతంత్ర భారతం–వర్తమాన పరిస్థితులు' అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించే సెమినార్‌కు ప్రొఫెసర్ నాగేశ్వర్ ఆమంచి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు వివరించారు. ఉపాధ్యాయులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో హాజరు కావాలని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ధరణి.. పరేషానీ!

సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం

- పోర్టల్‌లో 39 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్
- వరుస ఎన్నికలు, కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్ల బదిలీలతో ఆలస్యం
- ఫైళ్ల క్లియరెన్స్‌లో మందగించిన వేగం
- స్పెషల్ డ్రైవ్‌లోనూ ఫలితం శూన్యం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణి పోర్టల్‌కు వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో ఒకప్పుడు తెలంగాణలోనే నంబర్–1 స్థానంలో ఉన్న జిల్లా ప్రస్తుతం ఆ గుర్తింపును కోల్పోయిందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. వరుస ఎన్నికలకు తోడు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్ల బదిలీలతో దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. కలెక్టర్లు మారిన ప్రతీసారి క్షేత్రస్థాయి నివేదికల రూపకల్పనలో మార్పులు చేర్పులు తీసుకొస్తుండటం కూడా కారణమవుతోంది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ధరణి పోర్టల్‌లో దరఖాస్తులు పేరుకుపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 1 నుంచి 9 వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని భావించారు. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న కంపెనీ సహా సీసీఎల్ఏ నుంచి సరైన సహకారం లేకపోవడంతో తహసీల్దార్లు కూడా ఏమీ చేయలేక చేతులెత్తేయాల్సి వచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వం ఈ డ్రైవ్‌ను 11 నుంచి 17వ తేదీ వరకు పొడిగించినా ఆశించిన స్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదు. ఫలితంగా బాధితులకు మళ్లీ నిరాశే మిగిలింది.

వరుస బదిలీల ప్రభావం

2021–22లో ధరణి పోర్టల్ ర్యాంకింగ్‌లో జిల్లా తెలంగాణలోనే ప్రథమస్థానంలో నిలిచింది. ధరణి సమస్యల పరిష్కారంలో ఉత్తమ గుర్తింపు కూడా పొందింది. అప్పటి వరకు కలెక్టర్‌గా పని చేసిన అమయ్‌కుమార్ 2023 ఫిబ్రవరిలో మేడ్చల్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొత్తగా హరీశ్ రాగా అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత కేంద్ర ఎన్నికల కమిషన్ ఆయనపై వేటు వేసింది. అనంతరం భారతి హోళికేరి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది రోజులకే ఆమె ను కూడా తప్పించి, మేడ్చల్ కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న గౌతం పోట్రుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత జనవరి 3న శశాంకను కలెక్టర్‌గా నియమించారు. కేవలం 11 నెలల్లో నలుగురు కలెక్టర్లు మారారు. కలెక్టర్ మారిన ప్రతీసారి నివేదికల జాబితా తీరు మారుతూ వస్తోంది. ఒకరు ఆన్‌లైన్‌లో పంపమంటే.. మరొకరు ఆఫ్‌లైన్‌లో పంపాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమయంలో తహసీల్దార్లు, ఆర్డీఓలకు స్థానచలనం కల్పించడం.. అప్పటికే క్షేత్రస్థాయి అధికారులపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత బాధ్యతలు స్వీకరించిన వారు ఈ ఫైళ్లను ముట్టుకునేందుకు వెనుకాడారు. ఫలితంగా ధరణి సమస్యల పరిష్కారంలో ఒకప్పుడు రాష్ట్రంలోనే నంబర్ 1 స్థానంలో ఉన్న జిల్లా ప్రస్తుతం ఆ ర్యాంక్‌ను కోల్పోవాల్సి వచ్చింది.

బాధితుల ఎదురుచూపులు

ప్రస్తుతం ధరణి పోర్టల్‌లో మొత్తం 2,46,536 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో మన జిల్లా నుంచే అత్యధికంగా 39,076 ఉన్నాయి. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఇతర జిల్లాల్లో దరఖాస్తులను దాదాపు క్లియర్ చేశారు. కానీ మన జిల్లాలో మాత్రం ఏడు వేలకు మించి పరిష్కరించలేకపోయినట్లు తెలిసింది. వీటిలో మెజార్టీ దరఖాస్తులు వివాదాస్పద భూములకు సంబంధించినవే ఉన్నాయి. విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, మిస్సింగ్ సర్వే నంబర్లు, నిషేధిత జాబితాకు సంబంధించిన దరఖాస్తులే అధికం. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా షాబాద్ మండలంలో 1,580 దరఖాస్తులకు 580, శంకర్‌పల్లిలో 3 వేలకు 300, యాచారంలో 2,550కు 700, కందుకూరులో 2,531కు 400, మంచాలలో 2,291కు 250, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 2,111కు 274, మొయినాబాద్‌లో 2,246కు 571 దరఖాస్తులకు మాత్రమే నివేదికలు సిద్ధం చేసినట్లు తెలిసింది. మిగిలిన దరఖాస్తులు పరి ష్కారానికి నోచుకుంటాయో లేదో కూడా చెప్పలేని పరిస్థితి. మెజార్టీ దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో పడిపోవడంతో బాధితులకు ఎదురుచూపులు తప్పడం లేదు.అత్యవసర పరిస్థితుల్లో భూములు అమ్ముకోలేక వారంతా ఇబ్బంది పడుతున్నారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు

- వదంతులు నమ్మొద్దు
- ఎమ్మెల్యే కాలె యాదయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సోషల్ మీడియాలో తనపై వచ్చిన వార్తలను ఎమ్మెల్యే కాలె యాదయ్య ఖండించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొంత మంది కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఎట్టి పరిస్థితిల్లో పార్టీ మారే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని పేర్కొన్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని కొంత మంది తాను బీఆర్‌ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నానని తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు గెలిపించిన పార్టీలోనే ఉండి వారి కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం పోరాడుతానని స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ఈ ప్రాంత అభివృద్ధికి కాసాని జ్ఞానేశ్వర్ అధిక నిధులు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తిని ఎంపీగా గెలిస్తే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. బీసీ బిడ్డను గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలి
- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి పిలుపునిచ్చారు. మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మి గార్డెన్స్‌లో శుక్రవారం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆచారితో పాటు నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, పార్టీ ఎంపీ అభ్యర్థి భరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నరేంద్రమోదీ అనేక పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. వాటి గురించి ఇంటింటికీ వెళ్లి వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ప్రపంచంలో భారతదేశ ప్రతిష్టను పెంచారని, ప్రజలంతా ఆయనకు అండగా ఉండాలని కోరారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థి భరత్ మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ నుంచి విజయం సాధించి ప్రధాని మోదీకి కానుకగా అందించాలని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండె హరిప్రసాద్, దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు కాసుల వెంకటేశ్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య పాల్గొన్నారు.

25న మద్యం దుకాణాలు బంద్

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 25న హోలీ నేపథ్యంలో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వైన్ షాపులు, బార్‌లు, క్లబ్‌లు, కల్లు కాంపౌండ్లు మూసి ఉంచాలని, సోమవారం ఉదయం 6 నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. రహదారులు, బహిరంగ ప్రదేశాలలో గుర్తు తెలియని వ్యక్తులపై, వాహనాలపై రంగులు చల్లకూడదని, వీధులు, బహిరంగ ప్రదేశాల్లో గుంపులుగా ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ రాకపోకలకు ఇబ్బంది కలిగించకూడదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కబేళాలు, రిటైల్ బీఫ్ షాపుల మూసివేత

హోలీ సందర్భంగా ఈ నెల 25న జీహెచ్‌ఎంసీ పరిధిలోని కబేళాలు, రిటైల్ బీఫ్ షాపులను మూసివేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశించారు.

హైకోర్టు భూమిలో పనులు ప్రారంభం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీ పరధిలో రాష్ట్ర హైకోర్టుకు కేటాయించిన వంద ఎకరాల భూమిలో శుక్రవారం పనులు ప్రారంభమయ్యాయి. జేసీబీలు, బుల్డోజర్లతో భూ చదును పనులను చేపట్టారు. గతంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైకోర్టు భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ భూములను హైకోర్టుకు కేటాయించవద్దని ఓవైపు యూనివర్సిటీ విద్యార్థులు పోరాటం చేయటం, ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే పనులను ప్రారంభించటంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నగరం వేదికగా ఇంటర్నేషనల్ కరాటే టోర్నీ

2025లో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో పోటీలు

సాక్షి, సిటీబ్యూరో: కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో అంతర్జాతీయ వేదికైన జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలోని ప్రతిష్టాత్మకమైన ఇన్విటేషనల్ ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్– 2025కు నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదిక కానుంది. 2025 జనవరి 18 నుంచి 22 వరకు జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా (జేకేఏఐ) నిర్వహించే ఈ టోర్నీలో భారత్‌లో పాటు ప్రపంచవ్యాప్తంగా 30 దేశాలకు పైగా కరాటే ప్రావీణ్యులు పాల్గొంటారు. దీనికి సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాన్ని శుక్రవారం నగరంలోని జేకేఏ తెలంగాణ హోంబు డోజె వేదికగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేకేఏఐ తెలంగాణ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రాపోలు సుదర్శన్ మాట్లాడుతూ.. జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా 50 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా అతిపెద్ద ఇంటర్నేషనల్ టోర్నీని నిర్వహిస్తున్నామన్నారు. టోర్నీలో దాదాపు 5 వేల మంది పోటీ పడనున్నారని, ఇప్పటికే 15 దేశాలు సమోదయ్యాయని తెలిపారు. కటా (ఫారం), కుమిటే (స్పారింగ్) విభాగంలో జరిగే ఈ పోటీలకు జపాన్ నుంచి వచ్చే కరాటే నిష్ణాతులు ప్రత్యేక శిక్షణ ఇస్తారని చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ దయానంద్ కుమార్ తెలిపారు. ఇంటర్నేషనల్ టోర్నీలో కనీస అర్హత బ్లాక్ బెల్ట్ సెకెండ్ డాన్ అని, ఇతర విభాగాల్లో 12, 14, 16, 18 ఆ పైబడిన వయస్సుల వారీగా పోటీలు జరుగుతాయన్నారు.



తప్పుదోవకు చెక్!



- హెచ్ఎండీఏలో ఇక టీడీఆర్ ఆన్‌లైన్ బ్యాంక్
- త్వరలో ప్రారంభం కానున్న సేవలు
- సాంకేతికత రూపకల్పనలో యంత్రాంగం
- సర్టిఫికెట్ల జారీలో పారదర్శకతకు అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏలో త్వరలో ఆన్‌లైన్ టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బ్యాంకు సేవలు అందుబాటులోకి రానున్నాయి. టీడీఆర్ సర్టిఫికెట్‌లలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా అందజేసేందుకు వీలుగా ఆన్‌లైన్ బ్యాంకింగ్‌ను తీసుకురానున్నారు. టీడీఆర్ ఆన్‌లైన్ బ్యాంకింగ్ కోసం అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని హెచ్ఎండీఏ సిద్ధం చేస్తోంది. మరో వారం, పది రోజుల్లో ఇది వినియోగంలోకి రానున్నట్లు అధికారులు తెలిపారు. హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి కృష్ణకుమార్ టీడీఆర్ సర్టిఫికెట్‌ల జారీపై ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించిన దృష్ట్యా మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఆన్‌లైన్ బ్యాంకింగ్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు.

పొరపాట్లకు అవకాశం ఉండదు..

ఇప్పటి వరకు వివిధ రకాల నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టుల్లో, మాస్టర్‌ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణ వంటి పనుల్లో భూములు కోల్పోయిన వారికి టీడీఆర్‌లను మ్యానువల్‌గా అందజేస్తున్నారు. ప్లానింగ్ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అందజేసే నివేదికల ఆధారంగా టీడీఆర్‌లు విడుదలవుతున్నాయి. దీంతో పారదర్శకత లోపిస్తోందని హెచ్ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. ఏపీఓ కృష్ణకుమార్ తనపై అధికారులను తప్పుదోవ పట్టించిన ఉదంతంలోనూ క్షేత్రస్థాయిలో ఆయన ఎలాంటి పరిశీలన చేయకుండానే టీడీఆర్ సర్టిఫికెట్‌ల జారీకి మార్గం సుగమమం చేసినట్లు సమాచారం. దీనిని హెచ్ఎండీఏ కమిషనర్ దాన కిషోర్ సీరియస్‌గా పరిగణించి కృష్ణకుమార్‌పైన సస్పెన్షన్ విధించారు. టీడీఆర్ ఆన్‌లైన్ బ్యాంక్ వినియోగంలోకి వస్తే ఇలాంటి తప్పిదాలకు అవకాశం ఉండదు.

రెండేళ్లుగా ఔటర్ వరకు విస్తరణ..

గతంలో జీహెచ్ఎంసీ మాత్రమే టీడీఆర్‌లను అందజేసేది. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో టీడీఆర్ ఆన్‌లైన్ బ్యాంక్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. రహదారుల విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్‌లు, ఫ్లై ఓవర్లు, చెరువుల సుందరీకరణ, మాస్టర్‌ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణ, లింకు రోడ్ల అభివృద్ధి వంటి అనేక ప్రాజెక్టుల్లో జీహెచ్ఎంసీ అధికారులు టీడీఆర్‌ను సమర్థం అమలు చేశారు. నిర్మాణ పనుల్లో భూములు కోల్పోయిన వారికి నగదు రూపంలో పరిహారం చెల్లించడానికి బదులు టీడీఆర్‌లను అందజేశారు. దీంతో వారు వీటిని ఇతరులకు విక్రయించుకునే అవకాశముంది. లేదా అదనపు అంతస్తులను నిర్మించుకోవచ్చు.

- 1988లో అప్పటి ప్రభుత్వం ఈ పద్ధతిని అమల్లోకి తెచ్చింది. 2012లో ఈ పథకాన్ని పునరుద్ధరించారు. టీడీఆర్ విలువను 200 శాతానికి పెంచారు. జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రమే ఇది అమలయ్యేది. 2017లో ప్రభుత్వం టీడీఆర్‌పై మరోసారి దృష్టి సారించింది. దీని విలువను 400 శాతానికి పెంచింది. 2022 నుంచి హెచ్ఎండీఏ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు వరకు టీడీఆర్ పరిధిని విస్తరించారు. ఈ మేరకు టీడీఆర్‌ను పొందిన భూ యజమానులు ఔటర్‌రింగ్ రోడ్డు వరకు ఎక్కడైనా దీన్ని విక్రయించుకొనేందుకు, అదనపు అంతస్తులను కట్టుకొనేందుకు అవకాశం లభించింది. భవిష్యత్తులో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ వంటి నిర్మాణ పనుల్లో భూములను కోల్పోయిన వారికి టీడీఆర్‌లతోనే పరిహారాన్ని భర్తీ చేసే అవకాశం ఉంది.

డైరెక్టర్ వివరణ ఇవ్వాల్సిందే..

కాగా.. టీడీఆర్‌లపై ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించిన ఘటనలో సస్పెన్షన్‌కు గురైన కృష్ణకుమార్ సెలవులు కూడా ముగిసినట్లు తెలిసింది. ఈ ఉదంతంపై ఉన్నతాధికారులు ఆయన వివరణను కోరిన సంగతి తెలిసిందే. కృష్ణకుమార్‌తో పాటు సంబంధిత ప్లానింగ్ అధికారి, ప్లానింగ్ డైరెక్టర్‌ల నుంచి కూడా వివరణ కోరినట్లు హెచ్ఎండీఏ అధికారి ఒకరు తెలిపారు.

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో 'ఎమర్జెన్సీ రిలీఫ్ సెంటర్' ప్రారంభం



కాచిగూడ: రైల్వే ప్రయాణికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఎమర్జెన్సీ రిలీఫ్ సెంటర్‌ను శుక్రవారం ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి.కె.వెంకటేశ్వర్లు, హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ ప్రారంభించారు. టీఎక్స్ హాస్పిటల్ అండ్ సెకండ్ హార్ట్ ఎమర్జెన్సీ రిలీఫ్ సెంటర్ ఏర్పాటు అత్యవసర వైద్య సంరక్షణలో ఒక మైలురాయిగా వారు పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో పునరుజ్జీవనం, ప్రథమ చికిత్స, గాయాల నిర్వహణతో సహా కీలకమైన సహాయాన్ని అందించడంలో ఈఎంఆర్ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అంకితభావంతో కూడిన వైద్య నిపుణుల బృందం 24 గంటలు ఈఎంఆర్ సదుపాయాన్ని అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.అనురాధ, డాక్టర్ సీకే వెంకటేశ్వర్లు, టీఎక్స్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ కీర్తికర్ రెడ్డి, డాక్టర్ అర్చన, శ్రీకాంత్ వొడ్నాల, వేణుగోపాల్, కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ బాలాజీ, జగన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత



బాత్కులచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాల తొలగింపు

ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలపై కొరడా

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో నిర్మించిన అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు సర్వే నిర్వహించిన అధికారులు శుక్రవారం పోలీసుల సాయంతో అక్రమ నిర్మాణాలను, ప్రహరీలను నేలమట్టం చేశారు. ఇరిగేషన్ శాఖ ఏఈ రాజ్యలక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో కూల్చివేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎక్కడైనా చెరువులు, కుంటల కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని, కబ్జారాయుళ్లపై క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. త్వరలోనే ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు రక్షణ కోసం పూర్తి స్థాయిలోఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం బొంగ్లూర్‌లోని జిలాన్ ఖాన్ చెరువును పరిశీలించి ఎలాంటి ఆక్రమణలు లేవని తేల్చారు.

బాటసింగారం రెవెన్యూ పరిధిలో..

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రెవెన్యూ పరిధిలోని బాత్కుల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు జేసీబీలతో కూల్చివేయించారు. ఎన్నిసార్లు హెచ్చరికలు జారీ చేసినా అక్రమ నిర్మాణాలను నిలిపివేయకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చివేసినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

చెత్త ప్రదేశాల్లో మళ్లీ ముగ్గులు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో చెత్త వేసే ప్రాంతాలను శుభ్రం చేయడంతో పాటు తిరిగి అక్కడ చెత్త వేయకుండా ఉండేందుకు ముగ్గులు, రంగోలీ కార్యక్రమాలకు జీహెచ్ఎంసీ మళ్లీ శ్రీకారం చుట్టింది. గతంలో చెత్త పేరుకుపోయే ప్రదేశాల్లో ఈ విధానాన్ని అమలు చేశారు. కమిషనర్ మారడంతో ఆ కార్యక్రమానికి స్వస్తి పలికారు. తిరిగి పునరుద్ధరిస్తూ స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా అన్ని బస్తీల్లో మహిళా సంఘాలు, పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నగరంలోని చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు.. చెత్తను తీసుకెళ్లేవారికి, స్వచ్ఛ ఆటోల వారికి సమన్వయం కుదర్చాలని, ప్రతి బస్తీలో రోజూ ర్యాలీలు తదితరాలతో ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశించారు.

నీటి వనరులను పరిరక్షించాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నీటి వనరుల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుద్ధభవన్‌లోని ఈవీడీఎం కార్యాలయంలో నీటి వనరుల పరిరక్షణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని చెరువుల వద్ద ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ సరిహద్దులకు సంబంధించిన మ్యాప్‌లను చెరువుల వద్ద ప్రదర్శించాలని సూచించారు. లేక్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేసి సభ్యులతో వాట్సప్ గ్రూపులతో చైతన్యపర్చాలన్నారు. మొబైల్‌యాప్ రూపొందించి, అందులో తనిఖీల నివేదికలుంచాలని సూచించారు. చెరువుల చుట్టూ ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్, సివరేజి మళ్లింపు, సీసీ కెమెరాలు, వీధి దీపాలు, సెక్యూరిటీ గార్డుల ఏర్పాటుకు అంచనా ప్రతిపాదనలు 15 రోజుల్లో ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, సునంద, జోనల్ కమిషనర్లు హేమంత్ బోర్కడే, స్నేహ శబరీష్, అభిలాష అభినవ్, రవి కిరణ్ ,వెంకన్న, ముకుందరెడ్డి, చీఫ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్, లేక్స్) దేవానంద్ పాల్గొన్నారు.

హోలీకి ప్రత్యేక రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: హోలీ పర్వదినం సందర్భంగా ప్రయాణికుల రద్దీ మేరకు వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్–దానాపూర్ (07647/07648) స్పెషల్ ట్రైన్ ఈ నెల 23వ తేదీ రాత్రి 8.20కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.50కి దానాపూర్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 6.10కి దానాపూర్ నుంచి బయలుదేరి తెల్లవారుజామున 4.30 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. సికింద్రాబాద్–సంత్రాగచ్చి (07645/07646) స్పెషల్ ట్రైన్ ఈ నెల 23వ తేదీ రాత్రి 9.05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి దాటిన తర్వాత సంత్రాగచ్చికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 25వ తేదీ ఉదయం 5.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.10 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది.

ఇటుక బట్టీలను తొలగించండి

ఆదిబట్ల కమిషనర్‌కు గ్రామస్తుల వినతి


కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: కాలుష్య కారకాలుగా మారిన ఇటుక బట్టీలను ఆదిబట్ల మున్సిపాలిటీ నుంచి తొలగించాలని ఎంపీపటేల్‌గూడ, సాహెబ్ గూడ గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ పొట్టి అయిలయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇటుక బట్టీలతో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుందన్నారు. ప్రభుత్వం నుంచి తీసుకోవాల్సిన నిబంధనలు తుంగలో తొక్కి బట్టీలను నిర్వహించి వ్యాపారులు కోట్లకు పడగలెత్తారన్నారు. అలాగే విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో డ్రైనేజీ పనులు చేపట్టాలన్నారు. తాగు నీటి ఎద్దడి లేకుండా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, వెంకటయ్య, సత్తయ్య, శ్రీశైలం, రాజు, వెంకటేశ్, సత్తయ్య, లక్ష్మీపతి, కిరణ్, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

కారు ఢీ కొని చిన్నారి దుర్మరణం

అత్తాపూర్: అపార్ట్‌మెంట్ ఆవరణలో వాకర్‌లో ఆడుకుంటున్న చిన్నారిని నిర్లక్ష్యంగా కారును నడుపుకుంటూ వచ్చిన యువకుడు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.నాగర్ కర్నూర్ జిల్లాకు చెందిన వసుంధర, శ్రీనివాస్ దంపతులు బతుకుదెరువు నిమిత్తం అత్తాపూర్‌కు వలస వచ్చారు. పిల్లర్ నంబర్-208 సమీపంలోని అక్బర్ హిల్స్, సుల్తాన్ ప్యాలెస్‌లో వసుంధర పని చేస్తుండగా శ్రీను మేస్త్రీగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం వసుంధర తన కుమార్తె రుక్మిణి (ఎనిమిది నెలలు)ని వాకర్‌లో కూర్చోబెట్టి పని చేసుకుంటుంది. అదే సమయంలో అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న అయాజ్ అహ్మద్ కారులో వేగంగా అపార్ట్‌మెంట్‌లోకి రావడంతో కారు వాకర్‌లో ఆడుకుంటున్న చిన్నారి పైనుంచి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని తల్లిదండ్రులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రేమను గెలిచినా.. విధి ఓడించింది

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కందుకూరు: ప్రేమ పెళ్లికి కుటుంబసభ్యులు పచ్చజెండా ఊపారు. కొన్ని రోజుల్లోనే ఇరువురూ అధికారికంగా ఒకటి కానున్నారు. అంతలోనే విధి వక్రీకరించింది. రోడ్డు ప్రమాదం ఆ యువకుడిని బలిగొంది. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా గుంతకోడూరుకు చెందిన తూంకుంట రాములు పెద్ద కుమారుడు తూంకుంట శేఖర్(27) హైదరాబాద్ సంతోషనగర్‌లో నివసిస్తూ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటున్నారు. ఆయన ప్రేమించిన అమ్మాయితో వివాహం చేస్తామని తండ్రి గ్రామానికి రమ్మని పిలిచారు. దీంతో ఆయన సంతోషించి ప్రేమించిన అమ్మాయితో పాటు బంధువైన మరో మహిళను ఈ నెల 19న సంతోష్‌నగర్‌లో బస్సు ఎక్కించారు. సదరు అమ్మాయికి చెందిన ద్విచక్రవాహనంపై ఆయన స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో మండల పరిధిలోని దెబ్బడగూడ గేట్ వద్ద శ్రీశైలం రహదారిపై అతివేగంగా వచ్చిన కారు ఆయన బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఆయన్ని 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా గురువారం రాత్రి ఆయన మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్‌ఐ శ్రావణ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పొంచి ఉన్న పదవీ గండం!

- ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్‌పై వచ్చే నెల 4న అవిశ్వాస ఓటింగ్
- మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం


వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరి


కౌన్సిలర్ బర్ల మంగజ గదీశ్వర్‌యాదవ్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరికి పదవి గండం ముంచుకొస్తోంది. కౌన్సిలర్లు ఆయనపై ఇచ్చిన అవిశ్వాస నోటీసుల నేపథ్యంలో ఓటింగ్‌కు సమావేశ తేదీని ఖరారు చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వచ్చే నెల 4న మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీఓ సమక్షంలో యాదగిరిపై అవిశ్వాస సమావేశాన్ని నిర్వహించనున్నారు. గతంలో చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి(కాంగ్రెస్)పై బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరిని గద్దె దించాలని చైర్‌పర్సన్ వర్గీయులు కంకణం కట్టుకున్నారు. అందుకు అనుగుణంగా పావులు కదిపారు. వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరిపై అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్‌కు 16 మంది కౌన్సిలర్లు గత నెలలో నోటీసులు ఇచ్చారు. దీనిపై కాంగ్రెస్‌తోపాటు పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సైతం సంతకాలు చేయడం గమనార్హం. మున్సిపాలిటీ పరిధిలో 24 మంది కౌన్సిలర్లు ఉండగా తాజాగా 17 మంది ఆకులను వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తుంది. చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై అవిశ్వాసం పెట్టే అంశంపై యాదగిరి కీలకపాత్ర పోషించాడని చైర్‌పర్సన్ వర్గీయులు భావిస్తున్నారు. అందుకు పర్యావసానంగా ఆయనను గద్దె దించేందుకు యత్నాలు చేస్తున్నారు. గత 20 రోజులుగా క్యాంపుల్లోనే పలువురు కౌన్సిలర్లు ఉన్నట్లు సమాచారం.

వైస్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న బర్ల మంగ

వైస్ చైర్మన్ పదవిని తెలంగాణ ఉద్యమకారుడు బర్ల జగదీశ్వర్‌యాదవ్ భార్య కౌన్సిలర్ మంగ ఆశిస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో వారు చేరారు. ఆకుల యాదగిరిని పదవి నుంచి తప్పించి ఆ పీఠంలో కూర్చోడానికి మంగజగదీశ్వర్‌యాదవ్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లను క్యాంపునకు తరలించారు. చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి వర్గీయుల మంగకు మద్దతునిస్తున్నారు. అవిశ్వాసం నెగ్గిన వెంటనే వైస్‌చైర్మన్‌ను ఎన్నుకునేందుకు అవకాశం ఉండదు. తిరిగి వైస్‌చైర్మన్ ఎన్నికకు ఓ తేదీని ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయాలి. అంతవరకు ఈ పదవిని ఆశిస్తున్నా వారికి కౌన్సిలర్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కందుకూరు: అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని యాచకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రావణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంతో పాటు కొత్తగూడ చౌరస్తా ప్రాంతంలో గత ఐదేళ్లుగా 65–70 ఏళ్ల వయసున్న ఓ వృద్ధుడు బిక్షాటన చేసుకుంటున్నాడు. కాగా ఈ నెల 13న కొత్తగూడ చౌరస్తా వద్ద ఆయన అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని పెట్రోలింగ్ చేస్తున్న కానిస్టేబుల్ కె.మహేశ్ గుర్తించి ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఆయన మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

చేవెళ్ల: అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన గుర్తు తెలియని ఓ వృద్ధురాలి మృతదేహం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగాపురంలో లభ్యమైంది. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగాపురం గ్రామ పరిధిలోని సంగారెడ్డి బైపాస్ రోడ్డు పక్కన ఉన్న వాగులో సుమారు 65–70 ఏళ్ల వయసున్న వృద్ధురాలి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించగా ఆధారాలు లభించకపోవటంతో ఎవరనేది గుర్తించలేదు. ఆమె తలపై తెల్ల వెంట్రుకలు, రెండు ముక్కులకు పోగులు, ఎర్ర రంగు జాకెట్ ధరించి ఉందని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ సంతోష్ రెడ్డి తెలిపారు.

ఎన్‌ఎస్‌యూఐ కల్వకుర్తి ప్రధాన కార్యదర్శిగా ఫిరోజ్



ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్‌ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా ఆమనగల్లు పట్టణానికి చెందిన ఎండీ ఫిరోజ్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నియామకపు పత్రం అందించారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ.. తనను గుర్తించి ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, అభిజిత్, దినేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

ఇరిగేషన్ శంషాబాద్ డివిజన్ ఏఈ గోవింద్


వాగులో నిర్మించిన గోడను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారి

సాక్షి ఎఫెక్ట్..

తుక్కుగూడ: చెరువులు, వాగులు, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని శంషాబాద్ డివిజన్ ఇరిగేషన్ ఏఈ గోవింద్ హెచ్చరించారు. మంఖాల్ వాగులో రియల్టర్లు చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్మాణంపై సాక్షి దినపత్రికలో శుక్రవారం ×బఫర్ జోన్‌లో నిర్మాణాలు¥ అనే శీర్షికన వార్త ప్రచురితం అయింది. దీనిపై అధికారులు స్పందించారు. వాగులో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ గోవింద్ మాట్లాడుతూ.. రిటైనింగ్ నిర్మాణం పూర్తిగా బఫర్ జోన్‌లో ఉందన్నారు. వాగులో 8 మీటర్ల పొడవు బఫర్ జోన్‌లోకి వచ్చిందన్నారు. గోడ పనులను వెంటనే నిలిపి వేయాలని రియల్టర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆయన వెంట సిబ్బంది ఏసుదాస్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు నష్టం కలిగించొద్దు


కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

అధికారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన

షాద్‌నగర్: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ప్రజల ఆస్తులకు నష్టం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. షాద్‌నగర్ పట్టణంలోని పాత జాతీయ రహదారి విస్తరణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నాణ్యతతో కూడిన నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. విస్తరణ పనుల్లో భాగంగా ప్రజల ఆస్తులకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు పక్కన ఉన్న భవన యజమానులు ఆందోళన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా విస్తరణ పనులు చేపట్టాలన్నారు. ఇందుకు ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా చర్చించి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందెమోహన్, ముబారక్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు


మాడ్గుల: పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

మాడ్గుల: ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాడ్గుల సీఐ విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఇర్విన్ గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ కిషన్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

మట్టి టిప్పర్ల సీజ్

తలకొండపల్లి: అనుమతి లేకుండా చెరువు మట్టిని తరలిస్తుండగా, పక్కా సమాచారంతో పోలీసులు రెండు టిప్పర్లను పట్టుకొని సీజ్ చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అనుమతి లేకుండా మండల పరిధిలోని అంతారం చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరు డ్రైవర్లతో పాటు, యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడే సహకార సంఘం చైర్మన్ ఎన్నిక


సంఘ కార్యాలయంలో సమావేశమైన పాలకవర్గ సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం సహకార సంఘం నూతన చైర్మన్‌ను ఎన్నుకునేందుకు శనివారం పాలకవర్గం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మేనేజర్ జక్కుల ఐలేష్‌యాదవ్ తెలిపారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం ఇంచార్జి చైర్‌పర్సన్ నార్లకొండ మల్లమ్మజంగయ్య యాదవ్ అధ్యక్షతన పాలకవర్గం సభ్యులు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ ఎన్నిక అంశంతో పాటు సర్వసభ్య సమావేశంపై చర్చించారు. ఖాళీగా ఉన్న చైర్మన్ పదవి కోసం డైరెక్టర్ చేగూరి భరత్‌కుమార్ ఒక్కరే పోటీలో ఉన్నారు. దీంతో ఆయన ఎన్నిక లాంఛనమయ్యే అవకాశాలున్నాయి. సమావేశంలో డైరెక్టర్లు భరత్, యాదిరెడ్డి, జైపాల్‌రెడ్డి, లక్ష్మమ్మ, రాములు, బాలనర్సింహ, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఓటీ చట్టం కింద భూమి స్వాధీనం

సూచిక ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

మొయినాబాద్: విలువైన ప్రభుత్వ భూమిని పీఓటీ చట్టం కింద రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి రెవెన్యూ సర్వేనంబర్ 51/4లో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో గ్రామానికి చెందిన పేదలకు అసైన్డ్ చేశారు. అయితే అసైన్డ్ పొందిన వారి వారసులు తొంట అంతయ్య, నారాయణ, యాదయ్య, జంగయ్య చట్టవిరుద్ధంగా నగరానికి చెందిన వ్యక్తులకు విక్రయించారు. దానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు సదరు వ్యక్తులకు నోటీసులు అందజేశారు. పీఓటీ చట్టం ప్రకారం శుక్రవారం ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. అసైన్డ్ భూములను ఎవరైనా విక్రయించినా, కొన్నా పీఓటీ చట్టం కింద స్వాధీనం చేసుకుంటామన్నారు. అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రమోహన్, సిబ్బంది భాస్కర్, మహేందర్ తదితరులు ఉన్నారు.



భూమిలో బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు